సాక్షి కామారెడ్డి
ఆదివారం । 28 । జూలై । 2024



వన మహోత్సవం

జిల్లాలోని పలు పట్టణాలు, గ్రామాల్లో ఉత్సాహంగా వనమహోత్సవం నిర్వహించారు. కార్యక్రమాల్లో అధికారులు పాల్గొన్నారు.

- 11లో ▸



భక్తి శ్రద్ధలతో బోనాలు

జిల్లాలోని పలుచోట్ల శనివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి బోనాలను సమర్పించారు.

- 11లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
28.2/24.1

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమవుతుంది. పలుచోట్ల మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

నేటి నుంచి ఓపెన్ యూనివర్సిటీ తరగతులు

కామారెడ్డి అర్బన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కామారెడ్డి స్టడీ సెంటర్ డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థులకు తెలుగు, ఇంగ్లిష్ పాఠ్యాంశాల రెండో సెమిస్టర్ తరగతులు నిర్వహించనున్నట్లు స్టడీ సెంటర్ సమన్వయకర్త రాజ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 28వ తేదీ నుంచి ఆగస్టు 4వ తేదీ వరకు రెండో సెమిస్టర్ తరగతులు నిర్వహించనున్నామన్నారు. అలాగే ఆప్షనల్స్‌కు సంబంధించి ఆగస్టు 10 నుంచి 18వ తేదీ వరకు తరగతులు నిర్వహించనున్నట్లు సమన్వయకర్త తెలిపారు. విద్యార్థులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన కోరారు.

ర్యాగింగ్ చేస్తే చర్యలు తప్పవు

● బాన్సువాడ సివిల్ కోర్టు జడ్జి భార్గవి



బాన్సువాడ: కళాశాలల్లో విద్యార్థులపై ర్యాగింగ్ చేస్తే చర్యలు తప్పవని, విద్యార్థులు విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని బాన్సువాడ సివిల్ కోర్టు జడ్జి భార్గవి అన్నారు. శనివారం బాన్సువాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో యాంటి ర్యాగింగ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ర్యాగింగ్ చేయడం వల్ల అందరూ బాధపడాల్సి వస్తుందన్నారు. ర్యాగింగ్ చేసిన విద్యార్థికి కళాశాల నుంచి పంపించడం జరుగుతుందని పేర్కొన్నారు. అలా కళాశాల నుంచి పంపించకపోతే సంబంధిత ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాల్సి వస్తుందన్నారు. సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులపై స్నేహభావంతో నడుచుకోవాలని, సీనియర్ పేరుతో ర్యాగింగ్ చేస్తే కేసులు నమోదవుతాయని హెచ్చరించారు. దీంతో విద్యార్థి విలువైన జీవితం జైలు పాలవుతుందన్నారు. ర్యాగింగ్‌కు గురైన విద్యార్థి కూడా మానసికంగా కుంగిపోతారన్నారు. విద్యార్థినులపై అసభ్యకరంగా ప్రవర్తించిన కేసులు తప్పవన్నారు. మన భవిష్యత్‌ను మనమే నిర్మించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పాండురంగం, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ మూర్తి, న్యాయవాదులు ఖలీల్, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులను చితకబాదిన అటెండర్‌పై విచారణ



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులను చితబాదిన ఘటనలో అటెండర్‌పై డీఈవో రాజు, ఆర్డీవో మన్నె ప్రభాకర్ విచారణ చేపట్టారు. 'మందుకొట్టి.. చావగొట్టి' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన వార్తకు ఉన్నతాధికారులు స్పందించారు. 'సాక్షి' కథనం ఆధారంగా విచారణ చేసి నివేదికను అందించాలని ఉన్నతాధికారులు సూచించడంతో విచారణ చేపట్టినట్లు డీఈవో తెలిపారు. విచారణలో భాగంగా.. ఎల్లారెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మద్యం మత్తులో అటెండర్ విఠల్ విద్యార్థులను చితకబాదిన విషయం వాస్తవమేనని తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ మేరకు విచారణ నివేదికను ఉన్నతాధికారులతో పాటు కలెక్టర్‌కు అందించడం జరుగుతుందని డీఈవో రాజు తెలిపారు. విఠల్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారని, విద్యార్థులను చితకబాదిన అటెండర్‌పై పోలీసులకు ఫిర్యాదు చేయాలని పాఠశాల ప్రిన్సిపాల్‌కు సూచించడం జరిగిందన్నారు. విద్యార్థులను కొట్టిన విఠల్‌ను ఉన్నతాధికారులు సస్పెండ్ చేసినట్లు ఆర్డీవో తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో వెంకటేశం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేసు నమోదు

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : ఎల్లారెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాల అటెండర్ విఠల్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేశ్ శనివారం తెలిపారు. పాఠశాలలోని పలువురు విద్యార్థులను చితకబాదిన అటెండర్‌పై పాఠశాల ప్రధానోపాధ్యాయుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని చెప్పారు.

అమ్మానాన్నల యాదిలో..!

■ కన్నవారి పేరిట సేవా కార్యక్రమాలు
■ ఆదర్శంగా నిలుస్తున్న పలువురు
■ నేడు తల్లిదండ్రుల దినోత్సవం

అమ్మ, నాన్న.. ప్రేమానురాగాల కలబోతకు పర్యాయ పదాలు. నవ మాసాలు మోసి ఉగ్గుపాలు పట్టించి బిడ్డ ఉన్నతి కోసం తపన పడే తల్లి, వేలుపట్టి నడిపించి ప్రయోజకులుగా తీర్చిదిద్దేవరకు వెన్నంటి ఉండే తండ్రి ఎప్పటికీ పూజ్యులే. అమ్మ, నాన్న బతికున్నంత వరకు సేవలు చేయడమే కాదు, వారి మరణానంతరం కూడా కన్నవారి పేరిట సేవా కార్యక్రమాలు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. కామారెడ్డి జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన పలువురు తమ తల్లిదండ్రుల పేరిట అనేక సేవా కార్యక్రమాలతో కన్నవారికి పేరు తీసుకువస్తున్నారు. ఆదివారం తల్లిదండ్రుల దినోత్సవం సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం..

– సాక్షి, కామారెడ్డి



కామారెడ్డిలో పేదలకు పెళ్లిళ్లు చేస్తున్న వీటీ రాజ్‌కుమార్, వీటీ లాల్, కుట్టు మిషన్ల పంపిణీ

అనేక సేవా కార్యక్రమాలు




కామారెడ్డి పట్టణానికి చెందిన బాంబే క్లాథ్ షాపింగ్‌మాల్ యజమానులైన వీటీ రాజ్‌కుమార్, వీటీలాల్ తమ తల్లిదండ్రులు వీటీ ఠాకూర్, లీలావతి పేరిట కంటి, దంత ఆస్పత్రు లు నిర్వహిస్తూ పేదలకు ఉచితంగా వైద్యం, ఆపరేషన్లు చేయిస్తున్నారు. అలాగే ట్రస్టు ద్వారా సైతం సర్జరీలు చేయిస్తున్నారు. పేదలకు వివాహాలు, కుట్టుమిషన్లు, దుస్తులు పంపిణీ చేస్తుంటారు. పెళ్లిళ్లు, ఫంక్షన్లలో మిగిలిన ఆహారాన్ని సేకరించి పేదలకు పంపిణీ చేస్తూ వృథాను అరికడుతున్నారు. సేవల్లో ఎంతో తృప్తి ఉంటుందని వారు చెబుతున్నారు.



బీబీపేటలో తల్లి పేరుతో ఏర్పాటు చేసిన అంబులెన్స్, నిర్మించిన మూత్రశాలలు

అమ్మ పేరుతో అంబులెన్స్..



బీబీపేట మండల కేంద్రానికి చెందిన డాక్టర్ పెరుమాండ్లు తన తల్లి సుశీల పేరుతో అంబులెన్స్ కొనుగోలు చేసి గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు సౌకర్యం కోసం అందుబాటులో ఉంచారు. అలాగే గ్రామంలో మూత్ర శాలలు నిర్మించి ఇచ్చారు. వినాయక ఉత్సవాల సందర్భంగా మట్టి వినాయక విగ్రహాలను అందిస్తుంటారు. అమ్మ పేరుతో సేవ చేయడం అమ్మకు సేవ చేసినంత ఆనందంగా ఉందన్నారు.

ముఖద్వారంతో పాటు ప్రముఖుల విగ్రహాలు




భిక్కనూరు మండలం రామేశ్వర్‌పల్లికి చెందిన మద్ది చంద్రకాంత్‌రెడ్డి తన తల్లిదండ్రులు మద్ది సత్తమ్మ, రాజిరెడ్డిల జ్ఞాపకార్థం గ్రామ ముఖద్వారం నిర్మించారు. అలాగే గ్రామాలు వివేకానంద, మహాత్మాగాంధీ, అబ్దుల్ కలాం, ఒడ్డె ఓబన్న, ఇందిరాగాంధీ విగ్రహాలు, అలాగే నంది విగ్రహాలు ఏర్పాటు చేశారు. అమ్మ, నాన్నల పేరుతో సేవా కార్యక్రమాలు చేయడం ఎంతో సంతోషంగా ఉంటుందని పేర్కొన్నారు.

మెరిట్ స్కాలర్‌షిప్‌లు అందిస్తూ..





ఎల్లారెడ్డిలో ఉపాధ్యాయుడిగా పనిచేసిన జీవీఎస్ పవన్‌కుమార్ తన తల్లిదండ్రుల పేరిట గోర్తీశ్వర ట్రస్టును ఏర్పాటు చేసి తాను పనిచేసిన పాఠశాలల్లో పదో తరగతిలో మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు అందజేస్తుంటారు. రూ. 25వేలు, రూ. 10 వేలు అందించి ప్రోత్సహిస్తున్నారు. అమ్మ, నాన్న పేరిట సేవ చేయడం ఆనందంగా ఉందన్నారు.

తల్లి జ్ఞాపకార్థం ఫ్రీజర్ అందజేత



పెద్దకొడప్‌గల్ మండలం కాటేపల్లికి చెందిన పానుగంటి హన్మాండ్లు తన తల్లి పెంటమ్మ జ్ఞాపకార్థం ఫ్రీజర్‌ను అందజేశారు. అలాగే మండలంలోని గుడితండాలో గల హనుమాన్ ఆలయం వద్ద భవనం నిర్మించి, అందులో సౌకర్యాలన కూడా కల్పించారు. ప్రతి ఏడాది నిరు పేదలకు చీరలు, పిల్లలకు పుస్తకాలు, నోటుపుస్తకాలు అందజేస్తుంటారు. అమ్మ జ్ఞాపకంగా సేవలు చేస్తున్నట్లు హన్మాండ్లు పేర్కొన్నారు.

అమ్మానాన్న పేరిట వైకుంఠరథాలు




కామారెడ్డి పట్టణానికి చెందిన రెడ్డిశెట్టి చంద్రం తన తల్లిదండ్రులు తిరుమలమ్మ, నర్సయ్యల జ్ఞాపకార్థం రెండు వైకుంఠ రథాలు కొనుగోలు చేసి స్థానికంగా ప్రజలకు అందుబాటులో ఉంచారు. నిర్వహణ ఖర్చులు మాత్రమే తీసుకుని వాటిని అందిస్తున్నారు. అలాగే పేదల పెళ్లిళ్లకు పుస్తెమట్టెలు అందజేస్తారు. అమర్‌నాథ్ యాత్రికులకు భోజన సౌకర్యం కల్పించేందుకు ట్రస్టులో సభ్యుడిగా సహకరిస్తున్నారు. అమ్మ, నాన్న పేరుతో పేదలకు సేవ చేయడం సంతృప్తినిస్తుందని చంద్రం పేర్కొన్నారు.

విద్యార్థులకు సామగ్రి పంపిణీ



ఎల్లారెడ్డికి చెందిన రాష్ట్రపతి అవార్డు గ్రహీత అయిన నునుగొండ వెంకటయ్య పేరిట ఆయన కుమారుడు నునుగొండ మూర్తి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు డ్రెస్సులు, పుస్తకాలు, బ్యాగులు, టైబెల్టులు అందిస్తుంటారు. పేద విద్యార్థుల చదువులకు సాయం చేస్తుంటారు. తండ్రి పేరిట సేవా కార్యక్రమాలు చేయడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు.

సేవా కార్యక్రమాలు..




నాగిరెడ్డిపేట మండలం గోపాల్‌పేటకు చెందిన చకిలం ప్రవీణ్‌కుమార్ అనేక సేవా కార్యక్రమాలు చేస్తుంటారు. నాగిరెడ్డిపేట పీహెచ్‌సీలో రోగుల కోసం దుప్పట్లు, బెడ్ సీట్లు అందిచారు. తన తల్లి సుశీల పేరిట ప్రతి ఏడాది ప్రభుత్వ పాఠశాలలకు రూ. 10వేల విలువైన వస్తు సామాగ్రిని అందిస్తుంటారు.

'రియల్' కష్టాలు..

కుదేలైన స్థిరాస్తి వ్యాపారం
● ఆర్థిక ఇబ్బందుల్లో పెట్టుబడులు పెట్టిన వారు
● క్రయవిక్రయాలు లేక విలవిల్లాడుతున్న ఏజెంట్లు
● కుటుంబ పోషణకు తప్పని అప్పుల బాట
● మరో రెండేళ్లు ఇదే దుస్థితి కొనసాగవచ్చని అంచనాలు



కామారెడ్డి క్రైం : కొంతకాలంగా రియల్ ఎస్టేట్ రంగం దారుణంగా పడిపోయింది. పెట్టుబడులు పెట్టిన వారు ఆర్థిక ఇబ్బందుల్లో నలిగిపోతుండగా అదే రంగాన్ని నమ్ముకుని ఏజెంట్‌లుగా వ్యవహరిస్తున్న వారు ఖర్చులకు కూడా డబ్బులు దొరక్క విలవిల్లాడుతున్నారు. పూర్తిగా ఇదే వృత్తిపై ఆధారపడిన కొందరు ఏజెంట్‌లు తమ కుటుంబాలను పోషించడానికి అప్పుల బారిన పడుతున్న ఘటనలు సైతం కనిపిస్తున్నాయి. మరో రెండు సంవత్సరాల పాటు రియల్ రంగం కోలుకునే పరిస్థితులు కనిపించడం లేదని విశ్లేషకులు భావిస్తున్నారు. అప్పటి వరకు ఈ రంగంపై ఆధారపడిన వారికి కష్టాలు తప్పవనేది చాలామంది అభిప్రాయం.

పడిపోయిన వ్యాపారం..

హైదరాబాద్‌కు సమీపంగా ఉండడం, జాతీయ రహదారి, రైల్వే సౌకర్యం తదితర కారణాలతో మొదటి నుంచి రియల్ వ్యాపారంలో కామారెడ్డికి మంచి పేరుంది. జిల్లా కేంద్రంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలు, పట్టణాలు, మండలాలు, ప్రధాన క్రాస్ రోడ్లలో కూడా రియల్ వ్యాపారం జోరుగా సాగింది. వందల సంఖ్యలో వెంచర్లు వెలిశాయి. ప్లాట్లతో పాటు జిల్లాలోని వ్యవసాయ భూములకు కూడా డిమాండ్ పెరిగింది. ముఖ్యంగా హైదరాబాద్, మెదక్, సంగారెడ్డి ప్రాంతాల నుంచి బడా వ్యాపారులు, శ్రీమంతులు వచ్చి జిల్లాలోని చాలా ప్రాంతాల్లో భూములు కొనుగోలు చేశారు. మార్కెట్ బాగుందని ఇక్కడి వ్యాపారులు సైతం భారీగా పెట్టుబడులు పెట్టారు. కరోనా దెబ్బకు మూడేళ్ల క్రితం రియల్ వ్యాపారం కుదేలైంది. ఆ తర్వాత కాస్త పుంజుకున్నా ఏడాదిగా మళ్లీ పడిపోయింది. ఎన్నికల తర్వాత నెమ్మదిగా కోలుకుంటుందని అందరూ భావించారు. కానీ అలాంటి పరిస్థితులు మాత్రం ప్రస్తుతానికి కనిపించడం లేదని ఈ రంగంలో ఉన్న పలువురు చెబుతున్నారు. జిల్లాల్లో రియల్ రంగం కోలుకోవాలంటే ముందుగా హైదరాబాద్‌లో పుంజుకోవాల్సి ఉంటుంది. అంతర్జాతీయంగా కొనసాగుతున్న యుద్ధాలు, ఆర్థికమాంద్యం, తదితర కారణాలు హైదరాబాద్‌లో రియల్ రంగం పుంజుకోవడానికి అడ్డుగా మారుతున్నాయి. మరో ఆర్నెళ్లు గడిస్తే గానీ ఏమీ చెప్పలేమనేది వ్యాపారుల అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

కష్టాల్లో వ్యాపారులు, ఏజెంట్లు

వ్యాపారంలో క్రయవిక్రయాలు తగ్గుముఖం పట్టడంతో రియల్ పెట్టుబడులు పెట్టిన వ్యాపారులు లబోదిబోమంటున్నారు. ఒక దశలో ప్లాట్లు, భూముల ధరలు పెరగాల్సిన ధరల కంటే ఎక్కువగానే పెరిగాయి. ఇంకా పెరగవచ్చనే అంచనాలతో చాలా మంది పెట్టుబడులు పెట్టారు. ఇప్పుడు అమ్ముడుపోక ఇబ్బందులు పడుతున్నారు. ఇదిలా ఉండగా కొనుగోలు దారుడికి, అమ్మకందారుకు మధ్యవర్తిత్వం చేసే ఏజెంట్‌లు కామారెడ్డితో పాటు జిల్లా వ్యాప్తంగా వందల సంఖ్యలో ఉన్నారు. దీనినే వృత్తిగా చేసుకుని జీవిస్తున్నారు. వారంతా క్రయవిక్రయాలు లేక ఆర్థికంగా ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వారిలో చాలామంది కుటుంబ పోషణకు అప్పులు చేయాల్సిన పరిస్థితుల్లో ఉన్నట్లు రియల్ ఎస్టేట్ వర్గాలు చెబుతున్నాయి. పరిస్థితులు మారితే బాగుండని కోరుకుంటున్నారు.

మార్కెట్ పడిపోయింది



దాదాపు రెండేళ్లుగా రియల్ ఎస్టేట్ వ్యాపారం తగ్గిపోయింది. క్రయ విక్రయాలు అంతగా జరగడం లేదు. భూములపై పెట్టుబడులు పెట్టిన వారు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ఏజెంట్ల పరిస్థితి దయనీయంగా ఉంది.

– శివకుమార్, రియల్ ఎస్టేట్ వ్యాపారి, కామారెడ్డి

ధరలు ఎక్కువగానే ఉన్నాయి



రియల్ ఎస్టేట్ వ్యాపారం పడిపోయినప్పటికీ ప్లాట్లు, భూములకు ధరలు ఎక్కువగానే ఉన్నాయి. ఒక దశలో మార్కెట్ విలువ కన్న ఎక్కువగా పెరిగి అక్కడే ఆగిపోయింది. ఇప్పుడు కొనేవారే లేరు. కొన్ని రోజులు ఇలాగే ఉండవచ్చు.

–షేక్ బాబు, స్థానికుడు, కామారెడ్డి

తగాదాల పరిష్కారానికి కృషిచేయాలి



మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుజయ్ పాల్

● హైకోర్టు జడ్జి సుజయ్ పాల్

కామారెడ్డి క్రైం: స్వచ్ఛందంగా, సామాజిక బాధ్యతతో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుజయ్ పాల్ సూచించారు. శనివారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో కమ్యూనిటీ మీడియేషన్ వాలంటీర్లతో నిర్వహించిన సమావేశానికి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జె.శ్రీనివాస్ రావుతో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వీరికి ఆర్అండ్‌బీ అతిథిగృహం వద్ద జిల్లా జడ్జి వరప్రసాద్, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ సింధు శర్మ పుష్పగుచ్ఛాలు, మొక్కలను అందజేసి స్వాగతం పలికారు. అనంతరం జిల్లా పోలీసు కార్యాయంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జస్టిస్ సుజయ్ పాల్ మాట్లాడుతూ.. 2023లో తీసుకువచ్చిన మీడియేషన్ యాక్ట్ ద్వారా సామాజిక స్పృహ, సేవా భావం కలిగిన కొందరిని కమ్యూనిటీ మెడిటేషన్ వాలంటీర్లుగా ఎంపిక చేయడం జరిగిందన్నారు. చాలా మంది చిన్నచిన్న తగాదాలతో పోలీస్ స్టేషన్లు, కోర్టుల వరకు వెళ్లి సమయం, ధనం వృథా చేసుకుంటున్నారన్నారు. ఇరువర్గాలను సముదాయించి సమస్యను పరిష్కరిస్తే న్యాయంతో పాటు స్నేహపూర్వక సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కేరళ, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో ఇలాంటి మీడియేషన్ సెంటర్ల ద్వారా ఐదువేలకు పైగా కేసులు పరిష్కరించడం జరిగిందని తెలిపారు.

కోర్టుల చుట్టూ తిరిగి డబ్బులు వృథా చేసుకోవద్దు


చిన్నచిన్న తగాదాలను ఇరువర్గాలు, పెద్దమనుషుల సమక్షంలో పరిష్కరించడానికి కమ్యూనిటీ మీడియేషన్ వాలంటీర్లు పనిచేయాలని హైకోర్టు జడ్జి శ్రీనివాస్‌రావు సూచించారు. చిన్న సమస్యల కారణంగా ఏళ్ల తరబడి కేసులు, కోర్టుల చుట్టూ తిరిగి సమయాన్ని, డబ్బును వృథా చేసుకుంటున్నారని పేర్కొన్నారు. క్రిమినల్ బ్యాక్ గ్రౌండ్ లేని కమ్యూనిటీ వాలంటీర్లకు గొప్ప బాధ్యతను అప్పగించినట్లు తెలిపారు. సక్రమంగా, లాభాపేక్ష లేకుండా సామాజిక బాధ్యతతో వ్యవహరించాలన్నారు. రాష్ట్రంలోనే ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఈ కమ్యూనిటీ మీడియేషన్ వాలంటీర్ల నియామకం జరిగిందన్నారు. వీరికి రెండు రోజులు శిక్షణ అనంతరం గ్రామాల్లో పనిచేసే అవకాశం ఉంటుందని తెలిపారు. గతంలో గ్రామాల్లో పెద్ద మనుషులే ఇరువర్గాలతో మాట్లాడి సమస్యను అక్కడికక్కడే పరిష్కరించేవారని అన్నారు. అదే తరహాలో కమ్యూనిటీ మీడియేషన్ వాలంటీర్లు కూడా ఆదర్శవంతంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ మెంబెర్ సెక్రెటరీ పంచాక్షరీ, అదనపు జిల్లా జడ్జి శ్రీనివాస్ నాయక్ , సీనియర్ సివిల్ జడ్జి టి.నాగరాణి, జూనియర్ సివిల్ జడ్జి సుధాకర్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి దీక్ష, జిల్లా న్యాయసేవాధికార సంస్థ సూపరింటెండెంట్ చంద్రసేన్‌రెడ్డి పాల్గొన్నారు.



నిండుకుండలా 'సింగితం' రిజర్వాయర్

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ మండలంలోని సింగితం రిజర్వాయర్ నిండుకుండలా మారింది. శనివారం నాటికి నీటిమట్టం పూర్తి స్థాయికి చేరింది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు వరద నీరు వచ్చి చేరుతుండడంతో ఎప్పుడైనా అలుగు దూకే అవకాశం ఉంది. రిజర్వాయర్ నీటిమట్టం 416.550 మీటర్లు కాగా పూర్తి స్థాయిలో నీరుంది. ఎగువ నుంచి 120 క్యూసెక్కుల మేర వరద నీరు ఇన్‌ఫ్లోగా వస్తోంది. సింగితం రిజర్వాయర్ నిండుకుండలా మారడంతో మహమ్మద్ నగర్, గున్కుల్, నర్వ గ్రామాల ఆయకట్టు ప్రాంత రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పెరుగుతున్న పోచారం నీటిమట్టం



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట మండలంలోని పోచారం ప్రాజెక్టులో నీటిమట్టం శనివారం 10 అడుగులకు చేరింది. ఎగువ ప్రాంతంలో కురు స్తున్న వర్షాలతో లింగంపేట, గుండారం వాగుల ద్వారా ప్రాజెక్టులోకి వరదనీరు వచ్చి చేరుతోంది. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 676 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లోగా వస్తోందని ఇరిగేషన్ డీఈఈ వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రాజెక్టులో ప్రస్తుతం 0.489 టీఎంసీల నీరు నిల్వ ఉందని ఆయన చెప్పారు.

క్లుప్తంగా

సీపీఆర్‌తో ప్రాణాలు భద్రం



నిజాంసాగర్(జుక్కల్): గుండెపోటు, ఫిట్స్ వచ్చినప్పుడు సీపీఆర్‌తో ప్రాణానికి రక్షణగా నిలువాలని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు రోహిత్‌కుమార్ అన్నారు. శనివారం నిజాంసాగర్ మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ సీపీఆర్ డే కార్యక్రమంపై పంచాయతీ కార్యదర్శులు, పోలీసులు, మండల అధికారులకు అవగాహన కల్పించారు. ఆపత్కాల సమయంలో సీపీఆర్ చేయడం ద్వారా మనిషి ప్రాణాలను కాపాడవచ్చాన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో గంగాధర్, ఎంపీవో అనిత, పంచాయతీ కార్యదర్శులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎస్‌ఆర్‌కే విద్యార్థులకు అభినందన



కామారెడ్డి అర్బన్: తెయూ ప్రకటించిన డిగ్రీ 2, 4, 6 సెమిస్టర్ ఫలితాల్లో ఉత్తమ మార్కులు పొందిన స్థానిక ఎస్‌ఆర్‌కే విద్యార్థులను ఆర్కే గ్రూప్ సీఈవో ఎం.జైపాల్‌రెడ్డి శనివారం నిర్వహించిన కార్యక్రమంలో అభినిందించారు. భవానీ (9.72), సిహెచ్.మానస(9.60), డి.మనీషా(9.60) సీహెచ్.భావన(9.47), ఎస్.నిఖిత(9.44),ఎస్.రక్షిత(9.44),సాత్వికలను అభినందించారు. ప్రిన్సిపల్ దత్తాత్రి, అధ్యాపకులు మధుసూదన్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బాల్‌రెడ్డి, దత్తుకుమార్ పాల్గొన్నారు.

అడిషనల్ ఎస్పీగా కామారెడ్డి వాసి



సాక్షి, కామారెడ్డి : జిల్లా కేంద్రమైన కామారెడ్డి పట్టణానికి చెందిన విశ్వ ప్రసాద్ అడిషనల్ ఎస్పీగా పదోన్నతి వచ్చినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. పట్టణంలోని కాకతీయనగర్ కు చెందిన ఆర్టీసీ అధికారి వీరయ్య వీరమణి దంపతుల ప్రథమ పుత్రుడైన విశ్వప్రసాద్ 1991లో ఎస్సైగా పోలీస్ శాఖలో చేరారు. కామారెడ్డిలో బీఎస్సీ ఫారెస్ట్రీ చదివారు. ప్రస్తుతం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీగా వరంగల్ జిల్లాలో పనిచేస్తున్న ఆయన అడిషనల్ ఎస్పీగా పదోన్నతి పొందినట్లు పోలీసులు తెలిపారు. అడిషనల్ ఎస్పీగా పదోన్నతి పొందిన ఆయన డీజీపీకి రిపోర్ట్ చేయనున్నట్లు వారు తెలిపారు.

శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలి

పెద్దకొడప్‌గల్(జుక్కల్) : శాంతి భద్రతల పరిరక్షణకు మండల ప్రజలు సహకరించాలని నూతన ఎస్సై మహేందర్ పేర్కొన్నారు. పెద్దకొడప్‌గల్‌లో నూతన ఎస్సైగా మహేందర్ శనివారం బాధ్యతలను స్వీకరించారు. ఇంతవరకు విధు లు నిర్వహించిన కోనారెడ్డి కామారెడ్డి సీసీ ఎస్ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. కామారెడ్డి సీసీఎస్ కార్యాలయం నుంచి మహేందర్ బదిలీపై పెద్దకొడప్‌గల్ వచ్చారు.అనంతరం బేగంపూర్ చౌరస్తాలో తనిఖీలు నిర్వహించారు.

1న మాతా, పితృ సేవన పుస్తకావిష్కరణ

కామారెడ్డి అర్బన్ : తల్లిదండ్రులను ప్రత్యక్ష దైవాలుగా భావించాలని వేద పండితులు గంగవరం ఆంజనేయశర్మ అన్నారు. తన తల్లిదండ్రులు జి.నారాయణశర్మ–రాజ్యలక్ష్మిల 75వ (వ జ్రోత్సవ) వివాహ మహోత్సవం సందర్భంగా ఆగస్టు 1న గురువారం ఉగ్రవాయిసా యిమందిరంలో నిర్వహించే కార్యక్రమంలో 'మాతా–పితృసేవన వ్రత పూజ విధానం' పుస్తకావిష్కరణ చేయనున్నట్టు అంజనేయశర్మ తెలిపారు.

మక్క రైతు ఆశలపై ముసురు

- వర్షాల కారణంగా దెబ్బతింటున్న పంట
- తెగుళ్లు అధికంగా సోకే ప్రమాదం
- దిగుబడిపై ఆశలు వదులుకుంటున్న రైతులు!



వేంపల్లిలోని మక్క తోటలో నిలిచిన వర్షపు నీరు

బాల్కొండ: మక్కజొన్న సాగు చేసిన రైతుల ఆశలు అడియాసలయ్యే పరిస్థితి నెలకొంది. గత వారం రోజులుగా ఆగకుండా ముసురు కురుస్తుండడంతో మక్క పంట దెబ్బతింటుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నేలలో తేమశాతం పెరిగి పంటకు తెగుళ్లు వ్యాపిస్తాయని అంటున్నారు. సోయాను కాదని ప్రస్తుత ఏడాది రైతులు మక్క సాగు చేశారు. ప్రస్తుతం పంట చుంచు దశలో ఉంది. ముందస్తుగా సాగుచేసిన మక్క పంట కంకులువేసే దశలో ఉండగా, సమపాలల్లో ఉష్ణోగ్రత లేకపోతే పంట దెబ్బ తింటుందని రైతులు అంటున్నారు. నేలలో తేమ శాతం ఎక్కువైతే పంటకు ఎండు తెగులు వ్యాపించి నిలువుగా ఎండిపోతుంది. అంతే కాకుండా వేరుకుళ్లు తెగులు వ్యాపిస్తుంది. దీంతో ప్రస్తుత సంవత్సరం సాగుచేసిన మక్క పంటపై రైతులు ఆశలు వదులుకుంటున్నారు. మరో వారం రోజులు ఇలాంటి పరిస్థితి ఉంటే మక్క పంటను తొలగించాల్సి వస్తుందని రైతులు అంటున్నారు.

ప్రస్తుత సంవత్సరం పెరిగిన సాగు

ప్రస్తుత సంవత్సరం ఖరీఫ్ సీజన్‌లో మక్క సాగు అధికంగా పెరిగింది. గత కొన్నాళ్లుగా మక్కపంటకు బదులుగా రైతులు అధికంగా సోయాను సాగు చేశారు. కానీ గతేడాది సోయా దిగుబడి అమాంతం తగ్గడంతో రైతులు మక్కసాగు వైపు దృష్టి సారించారు. దీంతో 80 శాతానికి మక్క సాగు పెరిగింది. ప్రారంభం నుంచి ఆరు తడి పంటలకు అనువైన వాతావరణం ఉండటం, వర్షాలు మోతాదుగా కురువడంతో మక్క పంట ఏపుగా పెరగడంతో మంచి దిగుబడి వస్తుందని రైతులు ఆశించారు. అయితే, వారం రోజుల నుంచి కురుస్తున ముసురు మక్క పంటను దెబ్బ తీసిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

పంట దెబ్బతింటుంది



ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా మక్క పంట పూర్తిగా దెబ్బ తింటుంది. మక్క పంటకు అధిక వర్షం మంచిదికాదు. చుంచు దశలో ఉన్న మక్కలు చేతికి రాకుండాపోతాయి. ప్రస్తుత సంవత్సరం మక్క పంటను అధికంగా సాగు చేశాం. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి.

– నద్ముడ నర్సయ్య, రైతు

తల్లీ.. ఈ కష్టం ఎవరికీ రావొద్దు..

- యువతికి కాలేయ సమస్య
- ఇప్పటికే రూ. 14 లక్షలు ఖర్చు
- అయినా కుదుటపడని ఆరోగ్యం
- కాలేయంలో కొద్దిభాగం ఇచ్చేందుకు ముందుకొచ్చిన సోదరుడు
- రూ. 30 లక్షలు సమకూరితేనే శస్త్రచికిత్స
- దాతల కోసం ఎదురుచూస్తున్న కుటుంబం



షేక్ అజియా

భిక్కనూరు : చిన్నవయస్సులోనే ఆ యువతికి పెద్ద కష్టం వచ్చింది. కాలేయం పూర్తిగా దెబ్బతిని కాలేయ మార్పిడి చికిత్సకు దాతల కోసం ఎదురుచూస్తోంది. కళ్లముందు తన తోబుట్టువు కాలేయవ్యాధితో బాధపడుతుంటే చూడలేక.. తన కాలేయంలో కొంతభాగం ఇచ్చేందుకు ముందుకొచ్చాడు ఆమె అన్న.. అయినప్పటికీ కాలేయ సర్జరీ చేయించుకునేందుకు డబ్బుల్లేక కుమలిపోతోంది ఓ కుటుంబం.. వివరాల్లోకి వెళ్తే.. భిక్కనూరు మండలం కాచాపూర్ మండలానికి చెందిన షేక్ ఖదీర్–సలేహా దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. షేక్ ఖదీర్ కుటుంబ పోషణ నిమిత్తం కొన్నేళ్ల క్రితమే గల్ఫ్‌కు వెళ్లాడు. అక్కడ కూలీ పనులు చేస్తూ ఇంటికి డబ్బులు పంపుతున్నాడు. ఆ డబ్బులతోనే ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలకు పెళ్లిళ్లు అయ్యాయి. చిన్నకూతురు షేక్ అజియా ఇంటర్ వరకు చదివింది. అయితే 2017లో అకస్మాత్తుగా అజియా అనారోగ్యానికి గురికాగా ఆస్పత్రిలో చూపించగా కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నట్లు తేలింది. దీంతో మొదటిసారి రూ. 8 లక్షలు ఖర్చు చేసి, రెండోసారి 2021లో రూ. 5 లక్షలతో స్టంట్లు వేయించారు. దీంతో ఆ కుటుంబంపై అప్పులభారం విపరీతంగా పెరిగింది. కాని నాలుగు నెలల క్రితం మళ్లీ అజియా తీవ్ర అనారోగ్యానికి గురికాగా హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఏఐజీ ఆస్పత్రిలో చేర్పించారు. వైద్యులు షేక్ అజియా కాలేయం పూర్తిగా దెబ్బతిందని తేల్చడంతో ఆ కుటుంబం బోరున విలపించింది. చివరికి ఆమె అన్న కాలేయంలో 20శాతం ఇచ్చేందుకు ముందుకొచ్చినప్పటికీ సర్జరీకి రూ. 30 లక్షలు అవసరమవుతుందని వైద్యులు పేర్కొన్నట్లు బాధిత కుటుంబం వాపోతుంది. ప్రస్తుతం వారికి ఇల్లు తప్ప ఎలాంటి ఆస్తిపాస్తుల్లేవు. దాతలెవరైనా ముందుకొచ్చి సాయం చేస్తేతప్ప అజియా సర్జరీ అయ్యే పరిస్థితి కనిపించట్లేదు. ఫోన్‌పే 9705700754, గూగుల్‌పే 9010559193లో తోచినంత సాయం చేయాలని షేక్ అజియా కుటుంబం వేడుకుంటోంది.

సిద్దరామేశ్వర కోనేరు ప్రాచీన శిల్పకళకు నిదర్శనం

- కోనేరును సందర్శించిన హైకోర్టు న్యాయమూర్తులు



భిక్కనూరు సిద్దరామేశ్వరాలయం కోనేరును పరిశీలిస్తున్న హైకోర్టు న్యాయమూర్తులు

భిక్కనూరు: భిక్కనూరు సిద్దరామేశ్వరాలయం కోనేరు ప్రాచీన శిల్పకళకు నిదర్శనమని రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్, రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి సుజయ్‌పాల్ అన్నారు. హైకోర్టు న్యాయమూర్తి శ్రీనివాస్‌రావుతో కలిసి ఆలయ కోనేరును శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోనేరు అద్భుతంగా ఉందన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు కొడకండ్ల రామగిరిశర్మ కోనేరు విశిష్టతను సిద్దరామేశ్వరాలయం చరిత్ర గురించి న్యాయమూర్తులకు వివరించారు. అప్పటి కలెక్టర్ జితేష్ వి పాటిల్, స్వచ్ఛంద సంస్థ నిర్వాహకురాలు కల్పన రమేశ్, పలువురు స్వచ్ఛంద సంస్థల సహకారంతో కోనేరును పునర్నిర్మించారని వారికి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా జడ్జి సీహెచ్‌వీ ఆర్ఆర్ వరప్రసాద్, ప్రథమ శ్రేణి న్యాయమూర్తి సుధాకర్, తహసీల్దార్ శివప్రసాద్, ఆలయ ఈవో శ్రీధర్, పూజారి సిద్దగిరి శర్మ, సీఐ సంపత్‌కుమార్, పంచాయతీ ఈవో మహేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

కార్గో ఏజెంట్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

ఖలీల్‌వాడి: ఉమ్మడి జిల్లాలో టీజీఆర్టీసీ కార్గోలో ఏజెంట్ల నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ట్రాఫిక్ ఆర్టీసీ మేనేజర్ సదాశివ్ శనివారం తెలిపారు. ఉమ్మడి జిల్లా వాసుల వస్తువులను ఇతర ప్రాంతాలకు బుక్ చేయడం, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వస్తువులను వినియోగదారులకు చేరవేసేందుకు మండల, పట్టణ కేంద్రాల్లో కార్గో ఏజెంట్ల నియామకానికి దరఖాస్తులు కోరుతున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తుదారులు గ్రామ, మండల స్థాయిలో రూ.1000, జిల్లా స్థాయిలో రూ.5,000 సెక్యూరిటీ డిపాజిట్ చేయాల్సి ఉంటుందని, పూర్తి వివరాలకు, ఆర్మూర్ డిపో 73968 89496, బోధన్ 90142 96638, నిజామాబాద్ ఒకటో డిపో 91542 98727, నిజామాబాద్ రెండో డిపో 73968 89496, బాన్సువాడ 91542 98729, కామారెడ్డి డిపో 91542 98729, రీజినల్ కార్యాలయం 86399 63647 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

యువత ధర్మ రక్షకులుగా పనిచేయాలి



హనుమాన్ ఆలయం వద్ద సమావేశమైన వీహెచ్‌పీ సభ్యులు

నిజాంసాగర్(జుక్కల్) : నేటి సమాజంలోని యువకులు ధర్మ రక్షకులుగా దేశం కోసం, దర్మంకోసం ముందుండాలని కామారెడ్డి జిల్లా త్రిప్రఖండ మంత్రి వినోద్ అన్నారు. శనివారం మహమ్మద్ నగర్ మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయంలో విశ్వ హిందు పరిషత్ బజరంగ్ దళ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందు సాంస్కృతి సంప్రదాయాలను, దేవాలయాలను కాపాడాలన్నారు. హిందువులను, హైందవ ధర్మాన్ని కాపాడేలా, హిందూ సమాజాన్ని రక్షించేటట్టుగా ప్రతీ ఒక్క యువత ధర్మ రక్షకులుగా పనిచేయాలన్నారు. అనంతరం బజరంగ్‌ల్ మండల కమిటీని ఎన్నుకున్నారు. వీహెచ్‌పీ కార్యదర్శిగా ఆకాష్, సంయోజక్‌లుగా మోహన్, దుర్గప్రసాద్, గోరక్షక్‌లుగా నితిన్, శ్రీకర్, విద్యార్థి ప్రముఖ్‌లుగా అభిషేక్, భరత్, బలోపాసనా ప్రముఖ్‌గా శ్రీకర్, భాను సేవా ప్రముఖ్‌గా రాజశేఖర్, హరీష్ తదితరులు ఉన్నారు.

'అవ్వ తాతలకు ఉత్తరం' ప్రారంభం



కామారెడ్డి అర్బన్ : విద్యార్థుల్లో సృజనాత్మకత కార్యశాలలో భాగంగా బడిపిల్లల మన రచన శిల్పశాల–అవ్వ తాతలకు ఉత్తరం' కార్యక్రమాన్ని శనివారం కామారెడ్డి పట్టణ పరిధిలోని లింగాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రారంభించారు. సిరిసిల్లకు చెందిన పత్తిపాక ఫౌండేషన్, భీముని మల్లారెడ్డిపేటకు చెందిన గరిపెల్లి ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు హెడ్ మాస్టర్ టి.కమల, తెలుగు టీచర్, కవి,రచయిత్రి నమిలికొండ సునీత తెలిపారు. తెలంగాణలోని 30 పాఠశాలల్లో సృజనాత్మకత కార్యశాల నిర్వహిస్తుండగా లింగాపూర్ పాఠశాల ఎంపిక కావడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు.

డబుల్ ఇళ్ల చెక్కుల పంపిణీ



నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండలంలోని మైలారం గ్రామంలో శనివారం డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం చేసుకున్న నలుగురు లబ్ధిదారులకు ఇంటి బిల్లులను మాజీ ఏఎంసీ చైర్మన్ పెర్క శ్రీనివాస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డికి మైలారం గ్రామ ప్రజల తరుపున కృతజ్ఞతలు తెలిపారు. మిగితా బిల్లులు సైతం త్వరలోనే వస్తాయన్నారు. మాజీ సర్పంచ్ సాయిరాం, మాజి ఎంపీటీసీ మహేందర్, ప్రభాకర్ రెడ్డి, నాయకులు జగన్, చంద్రగౌడ్, లింగం గ్రామ పార్టీ నాయకులు ఉన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ



కామారెడ్డి అర్బన్ : నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేలో భాగంగా 3, 6, 9 తరగతుల విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించడానికి శనివారం స్థానిక బాలుర ఉన్నతపాఠశాలలో ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అకడమిక్ మోటివేటర్ వేణుశర్మ కేంద్ర విద్యా పరిశోధన శిక్షణ వివరాలను వివరించారు. జిల్లాలో ఎంపిక చేసిన పాఠశాలల్లో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్పీలు హరిప్రసాద్, ఆనందరావు, గోపికృష్ణ, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆయకట్టుకు భరోసా!



ఎస్సారెస్పీలో ప్రస్తుత నీటిమట్టం

- ఎస్సారెస్పీలోకి కొనసాగుతున్న వరద
- ఈ సీజన్‌లో తొలిసారి 35 వేల క్యూసెక్కులు దాటిన ఇన్‌ఫ్లో

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి వరద కొనసాగుతోంది. ప్రాజెక్ట్‌లోకి శనివారం సాయంత్రానికి 35 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రస్తుత సీజన్‌లో ఇదే అత్యధికం. దీంతో ప్రాజెక్ట్ నీటిమట్టం వేగంగా పెరుగుతోంది. జలాశయంలో నీటి నిల్వ 32 టీఎంసీలకు చేరుకుంది. ప్రస్తుత సంవత్సరం జూలై 15 వరకు వరదలు లేక ప్రాజెక్ట్ వెలవెలబోయింది. దీంతో వానాకాలం సీజన్‌లో పంటలకు కాలువల ద్వారా నీటి విడుదల చేపడుతారో లేదోనని ఆయకట్టు రైతులు ఆందోళన చెందారు. ప్రస్తుతం వర్షాలతో ప్రాజెక్ట్‌లోకి వరదలు రావడంతో ఆయకట్టుకు నీరు అందుతుందని వారు భరోసా వ్యక్తం చేస్తున్నారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో గరిష్టంగా 35 వేల క్యూసెక్కులు, కనిష్టంగా 17 వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చింది. వారం వ్యవధిలో 15 టీఎంసీల నీరు చేరింది. ప్రస్తుతం ఎగువ నుంచి ఇన్‌ఫ్లో పెరిగే అవకాశం ఉందని ప్రాజెక్ట్ అధికారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. వానాకాలం సీజన్‌లో ఆయకట్టుకు పూర్తి భరోసా రావాలంటే మరో 25 టీఎంసీల నీరు రావాలి. ఆగస్టు 15 వరకు కూడా కాలువల ద్వారా నీటి విడుదల చేపట్టిన సందర్భాలు ఉన్నాయి. దీంతో ప్రస్తుతం ఆయకట్టు రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేకుండా పోయింది.

వేగంగా పెరుగుతున్న నీటిమట్టం

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు కొనసాగుతుండటంతో ప్రాజెక్ట్ నీటి మట్టం వేగంగా పెరుగుతోంది. ప్రాజెక్ట్ నుంచి సరస్వతి కాలువ ద్వారా 10 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 397 క్యూసెక్కులు, మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 1091(80టీఎంసీలు) అడుగులు కాగా శనివారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1074.3(32 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు పేర్కొన్నారు.

నాలుగు రోజులుగా అడవిలో వృద్ధురాలు



అడవిలో పశువుల కాపరులు గుర్తించిన వృద్ధురాలు

నిజామాబాద్ రూరల్: నిజామాబాద్ జిల్లా రూరల్ మండలంలోని మల్లారం గ్రామ అటవీ ప్రాంతంలో నాలుగు రోజులుగా తిండితిప్పలు లేకుండా పడిఉన్న గుర్తుతెలియని వృద్ధురాలిని గ్రామానికి చెందిన పశువుల కాపరులు శనివారం గుర్తించారు. వారు 108 అంబులెన్స్‌కు ఫోన్ చేయగా రూరల్ పోలీస్ స్టేషన్ పోలీసులు వచ్చి ఆమెను జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. వృద్ధురాలికి 70 నుంచి 75 ఏళ్ల వయస్సు ఉటుందని, ఆమె ఎక్కడి నుంచి వచ్చిందనే వివరాలు చెప్పలేకపోందని ఎస్‌హెచ్‌వో మహేశ్ తెలిపారు. వద్దురాలిని ఎవరైనా గుర్తిస్తే ఫోన్ 8712659849 నంబర్‌కు లేదా రూరల్ పోలీస్ స్టేషన్లో సంప్రదించాలని ఆయన కోరారు.

చదువుపై శ్రద్ధ పెట్టాలి



మాచారెడ్డి : కిశోర బాలికలు చదువుపై శ్రద్ధ కనబర్చాలని ఉమెన్స్ ఆర్గనైజేషన్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ కామారెడ్డి జిల్లా మానిటరింగ్ కో ఆర్డినేటర్ రాణి సూచించారు. శనివారం మండలంలోని ఎల్లంపేట్, సోమారంపేట గ్రామాల్లోని పరిషత్ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న కిశోర, బాలబాలికలకు 8, 9, 10 తరగతులకు చెందిన బాలబాలికలకు విడివిడిగా కౌమార దశలో జరిగే మార్పులపై అవగాహన కల్పించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ ప్రతినిధులు రమేశ్ వంశీకృష్ణ, హెచ్ఎంలు రమణ, వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మద్యం సేవిస్తూ.. సెల్ఫీలు తీసుకుంటూ..



సెల్ఫీ తీస్తున్న యువకుడి చేతిలో బీరు సీసా

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో పెరుగుతుండగా, ప్రాజెక్టును సందర్శించేందుకు పర్యాటకులు తరలిస్తున్నారు. అయితే, యువకులు నీటి అంచు వరకు వెళ్తూ అక్కడే మద్యం సేవించడంతోపాటు సెల్ఫీలు తీసుకుంటున్నారు. గతంలో ప్రమాదవశాత్తు నీటిలోకి జారి పడిన సందర్భాలు అనేకం ఉన్నాయి. అయినప్పటికీ పరిస్థితిలో మార్పు లేదు. పర్యాటకులు ప్రాజెక్టు లోపలి వరకు వెళ్లకుండా అడ్డుకునే వారు కరువయ్యారు. ప్రాజెక్టు ఆనకట్టపై, ప్రాజెక్ట్ నీటి అంచున మద్యం సేవిస్తున్నా పట్టించుకునే వారు లేరు. ఉన్నతాధికారులు స్పందించి ప్రమాదాలు సంభవించక జాగ్రత్తలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

క్రైం కార్నర్

బాలుడి అదృశ్యం



సాయిరాం

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలకు చెందిన విద్యార్థి అదృశ్యమైనట్లు పట్టణ సీఐ వీరయ్య తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మోస్రా మండల కేంద్రానికి చెందిన బొంబాయి సాయిరాం పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. అయితే, సాయిరాం కనిపించడం లేదని పాఠశాల నుంచి తల్లిదండ్రులకు సమాచారం అందడంతో వారు పాఠశాలకు చేరుకున్నారు. పలుచోట్ల ఆరా తీసినప్పటికీ సాయిరాం ఆచూకీ లభించకపోవడంతో సదరు పాఠశాల ప్రిన్సిపాల్‌తో పాటు బాలుడి తల్లిదండ్రులు శేఖర్, విజయలక్ష్మి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని, రెండు బృందాలు బాలుడి ఆచూకీని గుర్తించేందుకు గాలిస్తున్నాయని సీఐ తెలిపారు. బాలుడు పాఠశాల నుంచి బయటికి వెళ్లినట్లు సీసీ ఫుటేజీలో ఉందన్నారు. బాలుడి ఆచూకీ తెలిసిన వారు పట్టణ పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు.

దొరికిన పర్సు అప్పగింత



ధర్పల్లి: రోడ్డుపై పడిపోయిన పర్స్‌ను పోలీసులకు అప్పగించి ఓ యువకుడు నిజాయితీ చాటుకున్నాడు. ఈ సంఘటన ధర్పల్లి మండలంలో శనివారం చోటుచేసుకుంది. దమన్నపేట్ గ్రామానికి చెందిన కల్ల సిసింద్రీ రాముడుగు నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా, రోడ్డుపై పర్సు దొరకడంతో ధర్పల్లి పోలీస్‌స్టేషన్‌లో అప్పగించాడు. పర్సులో రూ.6 వేల నగదుతోపాటు విలువైన కార్డులు ఉన్నాయి. పోలీసులు బాధితుడిని స్టేషన్‌కు పిలిపించి పర్స్‌ను అప్పగించారు. దొరికిన పర్సును పోలీస్‌స్టేషన్‌లో అప్పగించిన సిసింద్రీని ఎస్సై విక్రమ్‌తోపాటు పలువురు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

వేల్పూర్: నిలిపి ఉంచిన ట్రాక్టర్‌ను బైక్‌ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందిన ఘటన మండలంలోని వెంకటాపూర్‌లో శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసకుంది. ఎస్సై వినయ్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన సంతోష్(45) తన బైక్‌పై గ్రామ సమీపంలోని ఆర్డర్‌మెస్‌కు కోళ్ల సరఫరా చేసి, తిరిగి వస్తుండగా రోడ్డుపై గొండల మహిపాల్ అనే వ్యక్తి నిలిపి ఉంచిన ట్రాక్టర్‌ను బైక్ ఢీకొన్నది. ఈ ఘటనలో తలకు బలమైన దెబ్బలు తగలడంతో సంతోష్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య భాగ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

అనుమానాస్పద మృతిపై కేసు నమోదు

బోధన్‌రూరల్: మండలంలోని మావంది కలాన్ గ్రామానికి చెందిన సూర్య సురేశ్ (35) అనే వ్యక్తి శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందగా, అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై నాగనాథ్ శనివారం తెలిపారు. 25వ తేదీన రాత్రి ఇంట్లో పడుకున్న సురేశ్ మరుసటి రోజు తెల్లవారుజామున 5.30గంటలకు మృతి చెందాడు. అయితే, సురేశ్ మృతిపై అతడి అక్క పోశవ్వ అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సురేశ్ భార్య కావ్యపై అనుమానం ఉన్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఉచిత దంత వైద్యశిబిరం



నిజామాబాద్‌నాగారం: నగరంలోని డాక్టర్ శ్రీనునాయక్ డెంటల్ ఆస్పత్రిలో శనివారం ఆస్పత్రి 23వ వార్షికోత్సవం సందర్భంగా ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు శ్రీనునాయక్ ఆధ్వర్యంలో రోగులకు దంత వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు జయశంకర్ స్మారకోపన్యాస సెమినార్

భిక్కనూరు : తెలంగాణ విద్యవంతుల వేదిక ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్‌లో ప్రొఫె సర్ జయశంకర్ స్మారకోపన్యాసం సెమినార్‌ను ఈనెల 28 ఆదివారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు వేదిక జిల్లా అధ్యక్షుడు బోయిన స్వామి తెలిపారు. శనివార భిక్కనూరులో ఆయన మాట్లాడుతూ తెలంగాణ తొలి మలి ఉద్యమాల గురించి ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ సాధన కోసం చేసిన ఉద్యమం గురించి ఈ సెమినార్‌లో చర్చిస్తామన్నారు. మేధావు లు, తెలంగాణ విద్యావంతులు, కవులు, ప్రజలు హాజరుకావాలన్నారు.